# దారి

హైదరాబాద్ పాత బస్తీలోని ఒక సాయం కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న రోజులవి. ఆ అమ్మాయి అప్పుడు నా విద్యార్థిని. పేరు వినతి.

పొద్దంతా పనిచేసి సాయంకాలం ఆ కళాశాలలో చదివే విద్యార్థుల్లో వినతి ఒక విద్యార్థిని. అందులో కొత్త విషయమేం లేదు. వినతి కంటే కష్టపడి చదువుకున్న విద్యార్థుల్ని ఎందర్నో చూశాను. సరదాగా డిగ్రీ కోసం వచ్చే విద్యార్థుల్ని గమనించాను. కానీ వినతి గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన విషయం ఒకటుంది.

కో-ఎడ్యుకేషన్ వున్న కళాశాలలో అమ్మాయిల్ని అబ్బాయిలు, అబ్బాయిల్ని అమ్మాయిలు కొందరు ఆట పట్టించడం, కొందరు వెకలిచేష్టలకు పూనుకోడం, లెక్చరర్లు చూసి చూడనట్లు వుండటం, ప్రిన్సిపాల్ తనకేమీ తెలియనట్టు నటించడం పరిపాటి!

వినతి పట్ల విద్యార్థులు వెకిలి చేష్టలు మరీ భరింపరానివిగా ఉండేవి. ఆ అమ్మాయిని ఏడ్పించే అధికారం తమకున్నట్టు ప్రవర్తించేవాళ్ళు ఒక రోజు ఓ విద్యార్థి ఆ అమ్మాయి బుగ్గలు నిమరడానికి పూనుకున్నాడంటే పరిస్థితి ఎంత దారుణంగా వుందో అర్థం చేసుకోవచ్చు. నాకు ఒళ్ళుమండింది - ఎప్పటిలా, అందరిలా చూసిచూడనట్టు ఉండలేకపోయాను.

ఆ విద్యార్థిని పిలిచి చివాట్లు పెట్టాను.

"దాని గురించి మీకేం తెలుసు స్సార్!" అన్నాడు ఆ విద్యార్థి పొగరుగా.

"మర్యాదగా మాట్లాడ్డం నేర్చుకో. నీ సహపాఠిని అలా సంబోధించవచ్చా?" అని గద్దించాను.

"బయట అది చేసే పనులు మీకేం తెలుసు!"

"నీకు తెలిస్తే బయటనే మరచిపో - కాలేజీలో అందరూ సమానం. మీరు వొచ్చేది చదువుకోడానికికి గాని ఎవరి పర్సనల్ విషయాలో తవ్వడానిక్కాదు. ఇంకోసారి ఆ అమ్మాయిపట్ల అసభ్యంగా ప్రవర్తించావంటే నీ మీద సీరియస్ చర్య తీసుకోవాల్సి వస్తుంది" అని హెచ్చరించాను.

అంత మాత్రానికి మా ప్రిన్సిపాల్ గారు చాలా నొచ్చుకున్నారు. "మనకెందుకు పోనీయండి-" అని సలహా ఇచ్చారు. అంతకంటే ఆయనేం చేయలేదని తెలుసు. నన్ను సపోర్ట్ చేస్తారని ఆశించలేదు కూడా - అందుకే నేనేం విచారించలేదు. మా కొలీగ్స్ కొందరు వెకిలి నవ్వులు నవ్వి ఏవేవో కామెంట్స్ చేశారు - గాంధీగారి రెండవ కోతి బొమ్మలా చెవులు మూసుకున్నాను.

ఒక రోజు స్టాఫ్ రూంలో నేనొక్కణ్ణే ఉన్నాను. ఇండియన్ ఎకనామిక్ ప్లానింగ్ మీద లెక్చర్‌కు ప్రిపేరవుతున్నా- మా కొలీగ్స్ ఇంకా ఎవరూ రాలేదు. ఆయా స్టాఫ్‌రూం వూడ్చి మంచినీళ్ళ కూజా దించిపోయింది.

"సార్..."

తలెత్తి చూశాను.

ఎదురుగా వినతి...!

కనుబొమలెత్తి ఏవిటన్నట్లు చూశాను.

దగ్గరగా వచ్చింది.

"సార్... నేను చదువు మానేద్దాం అనుకుంటున్నా" అన్నది నీళ్ళు నిండిన కళ్ళతో..

వినతి ఆ నిర్ణయానికి కారణం ఏమిటో నాకు తెలుసు.

"చూడమ్మా! వాళ్ళకు భయపడి చదువు మానేయటం మంచి పని కాదు. అది వారికి విజయం. వారిని ప్రోత్సహించినట్టు అవుతుందికూడా. రేపు మరో అమ్మాయిని అల్లరికి గురిచేస్తారు. ఇలా అమ్మాయిలంతా ఆ మూకకు భయపడి చదువులు మానేయాల్సిందేనా?" అని అడిగాను.

"నాకు తోడబుట్టిన అన్నలు లేరు సార్. ఉంటే వాళ్ళిట్లా అల్లరి చేసే వాళ్ళేనా? నేనీ పరిస్థితిలో కూడా ఉండేదాన్ని కాదు. చెల్లాయిలు ఇద్దరు చిన్నవాళ్ళు. ఇంటికి పెద్దదాన్ని నేనే..."

కన్నీళ్ళను దిగమింగుకుంటూ అన్నది వినతి -

"అంత కష్టపడి చదువుకుంటున్నావు కదా... ఇంకో సంవత్సరమైతే డిగ్రీ పూర్తవుతుంది. ఏదైనా ఉద్యోగం వస్తే మీ కుటుంబానికి అండగా నిలబడగలవు. చదువు మానేయకు" అని ధైర్యం చెప్పాను.

ఏదో చెప్పబోయింది. "ఇంకేం మాట్లాడకు. చదువు కంటిన్యూ చేయి..." అన్నాను.

"థ్యాంక్స్ సర్" అని వెళ్ళిపోయింది వినతి.

డిగ్రీ పూర్తి చేసింది.

రెండేళ్ళయింది కాబోలు -

మళ్ళీ ఇవ్వాళ కనిపించింది.

కనిపించకున్నా బాగుండేది. కనిపించరాని చోట కనిపించి మనసు కలచివేసింది. పదవీ విరమణ చేసి సంవత్సరం దాటింది - ఆరోగ్యం సరిగా లేక డాక్టర్ చెకప్ కోసం సిటీ వెళ్ళాను. తోడుగా మా బావమరిది వచ్చాడు. చూడాల్సిన డాక్టర్ అపాయింట్‌మెంట్ మరునాటికి దొరికింది. మళ్ళా పూడెళ్ళి రావడం ఖర్చు, కష్టమని ఆ రాత్రికి లాడ్జింగ్‌లో ఉన్నాం.

అక్కడ తచ్చాడుతూ కనిపించింది వినతి!

నా గుండె ఒక్కసారిగా కలుక్కుమన్నది. వినతి గురించి విద్యార్థులు చేసిన కామెంట్స్ గుర్తుకొచ్చాయి.

నన్ను చూసి కంగారుగా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది వినతి.

మరునాడు డాక్టర్ సలహా మేరకు వారి నర్సింగ్ హోంలోనే వారం రోజులు వుండాల్సి వచ్చింది.

ఒకరోజు మధ్యాహ్నం నర్సింగ్‌హోం స్పెషల్ రూంలో నేనొక్కణ్ణే వున్నాను. మా బావమరిది బయటికి వెళ్ళాడు. నా భార్య ఆ రోజూ ఉదయమే ఊరికి వెళ్ళిపోయింది.

గోడకు ఒరిగి కూర్చొని పత్రిక తిరగేస్తున్నాను.

"గుడాఫ్టర్‌నూన్ సర్..." అనే మాట విని తలెత్తి చూశాను.

వినతి!

ఆశ్చర్యపోయాను...!

తిరిగి నేను విష్ చేయలేదు.

కనీసం మర్యాద కోసమైనా చిరునవ్వు నవ్వలేదు!

"మీ ఆరోగ్యం సరిగా లేదని తెలిసింది. ఇప్పుడెలా వుంది సార్?" అని అడిగింది.

నేను ఆ అమ్మాయి మొహం చూడటం లేదు. ఎటో చూస్తూ ముక్తసరిగా అన్నాను-

"ఫరవాలేదు - ఇప్పుడు కొంచెం మెరుగయింది."

"ఈ పళ్ళు తీసుకోండి సర్" అన్నది స్టూలుపై పెడుతూ...

"వొద్దు - దయచేసి వాటిని తీసుకెళ్ళు" అన్నాను.

నా చెవులకు నాకే గొంతు కఠినంగా వినిపించింది.

వినతి మనసు నొచ్చుకున్నట్లుంది.

వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ వెళ్ళిపోయింది.

కాని నా మనసులోంచి వెళ్ళిపోలేదు. నా గుండెను తవ్వుతోంది వినతి.

ఆ అమ్మాయి మనసు కష్టపెట్టిన మాట నిజమే కాని... నా కూతురు లాంటి వినతి అడుసు తొక్కుతున్నదే అని విచారించాను.

ఏ మూలో నన్ను నేనే ద్వేషించుకుంటున్నా, నా చర్యను మాత్రం సమర్థించుకోడానికి ప్రయత్నం చేశాను.

విషయం అక్కడితో ఆగిపోలేదు...!

మరునాడు సాయంకాలం మళ్ళీ వచ్చింది వినతి!

చేతిలో సంచి, మాడర్న్ బ్రెడ్ పాకెట్ ఉన్నాయి.

"మళ్ళీ ఎందుకు తెచ్చావ్!" మొహం చిట్లించి అడిగాను. ఆ అమ్మాయి నా శిష్యురాలు అని ఊహించుకోలేకపోతున్నాను. ఆమె నీడను చూడాలంటేనే అసహ్యంగా వుంది.

"ఇవి... ఆ డబ్బుతో తెచ్చినవి కావు సార్..." దీనంగా మొహం పెట్టి అన్నది.

సంచి స్టూలు మీదపెడుతుంటే చూశాను. ఆ చేతులు బొబ్బలెక్కి ఉన్నాయి.

"పొద్దుట్నుంచి ఇప్పటి దాకా తట్టమోశాను. రాళ్ళు మోశాను. ఆ కూలీతో కొన్ని పండ్లు... బ్రెడ్... సర్... వీటిని తీసుకోరూ...?"

కన్నీళ్ళతో అభ్యర్థించింది. బొబ్బలెక్కినరెండు అరచేతులను జోడించింది.

నా కళ్ళు చెమరించాయి. హృదయం ద్రవించింది–వినతిని దాపున కూచోబెట్టుకుని లాలనగా తల నిమురుతూ–

"బతుకు దెరువుకు ఇన్ని మార్గాలుండగా ఆ నీచమైన దారినెందుకు తొక్కావు తల్లీ" అని అడిగాను.

*ఆంధ్రజ్యోతి, దీపావళి ప్రత్యేక సంచిక, 1993*